ప్రజాశక్తి

సోమవారం 3 మార్చి 2025 | 8 పేజీలు




ఎన్‌టిఆర్



కృష్ణా

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు



అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది... ఎవరు అధైర్యపడొద్దు.. ప్రభుత్వం నుండి అనుమతులు రాకుండా మేము ఏమి చేయలేము.. ఇలా ప్రభుత్వ పెద్దలు, జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు చెబుతున్న మాటలకు పొంతన కుదరడం లేదు. దీంతో కృష్ణాజిల్లాలో ధాన్యం అమ్మని అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా అన్నదాతల పరిస్థితి మాత్రం మారడం లేదు. అప్పులు చేసి ఆరుగాలం పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా రైతులు అనేక అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. జిల్లాలో గత ఖరీఫ్ సీజన్లో 1.67 లక్షల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. 9.79 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందుకు గతేడాది నవంబరు 13 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించారు. గత నాలుగు నెలల వ్యవధిలో 5.80 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 4.86 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. మార్చి నెలాఖరు నాటికి ధాన్యం (మిగతా 2లో)



03-03-2025 సోమవారం

సహర్ (ఉదయం) : 5.07

ఇఫ్తార్ సాయంత్రం : 6.20

04-03-2025 మంగళవారం

సహర్ (ఉదయం) : 5.07

ఎన్‌టిటిపిఎస్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రంలో కార్మికుడు మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎన్‌టిటిపిఎస్‌లోని స్టేజ్-5 డిఎం వాటర్ ప్లాంట్ ట్యాంక్‌లో పెయింట్ వేస్తుండగా రామవరప్పాడుకు చెందిన బుర్రా ప్రసాద్ (43) ఊపిరాడక చనిపోయాడు. గాయపడ్డ మరో కార్మికుడు జి.కిషోర్‌బాబును ఆసుపత్రికి తరలించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు అంటున్నారు. మృతిచెందిన కార్మికుని కుటుంబానికి వర్క్ మ్యాన్ కాంపెన్సేషన్ యాక్ట్ అమలు చేసి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరుగుతున్నా, కార్మికుల ప్రాణాలు పోతున్నా నివారణా చర్యలు తీసుకోవడంలో విటిపియస్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితమే కోల్డ్ ప్లాంట్‌లో బాయిలర్ పేలినా అధికారులు తూతూమంత్రంగా భద్రతా చర్యలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రతా ప్రమాణాలపై యాజమాన్యం నిర్లక్ష్యం మొద్దునిద్ర వీడి కార్మికులకు రక్షణ కల్పించాలని, లేని పక్షంలో సిఐటియుగా ఆందోళనలను ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

నెత్తురోడుతున్న రహదారులు

... వార్త 5లో

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం బాబూరావు

... వార్త 7లో

ఓట్ల లెక్కింపునకు అంతా సిద్ధం

- నేడు ఉదయం 8 గంటల నుండి ప్రారంభం
- ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఆర్ఒ నాగలక్ష్మి



కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఏసీ కాలేజీలో సోమవారం నుండి చేపట్టనున్న ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి ఏసీ కాలేజి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జేసీ ఎ.భార్గవ్‌తేజ, డిఆర్ఒ ఖాజావలితో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 27న ఓటింగ్ ముగిసిన అనంతరం అన్ని జిల్లాల బ్యాలెట్ బాక్సులను ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి భద్రపరిచినట్లు చెప్పారు. పోలింగ్ 69.5 శాతం నమోదైనందున దాదాపు 2.41 లక్షల ఓట్లు లెక్కించాల్సి ఉందని చెప్పారు. ఉదయం 8 గంటల నుండి లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. బ్యాలెట్ పేపర్, మొదటి ప్రాధాన్యత ఓట్లు విధానంతో లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం కౌంటింగ్ సుమారు రెండు నుంచి మూడ్రోజులు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాథమికంగా లెక్కింపు మొదటి రౌండ్లో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను సరిచూసుకొని మిక్సింగ్ చేస్తారన్నారు. తర్వాత చెల్లుబాటయ్యే ఓట్లను పరిశీలించి మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారని చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సమయానికి నిర్దేశించిన కోటా ఓట్లు వచ్చిన అభ్యర్థిని గెలుపొందినట్టు ప్రకటిస్తామని తెలిపారు. అభ్యర్థులు ఎవరికి నిర్దేశిత కోటా ఓట్లు రాకపోతే ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వారికి వచ్చిన తదుపరి ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచుతూ లెక్కింపు కొనసాగుతుందని వివరించారు. ఓట్ల లెక్కింపు కోసం మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా (మిగతా 2లో)

కమ్ముకుంటున్న బూడిద

- చెరువు వద్ద ఇష్టారాజ్యం
- పైపులైన్ నిర్వహణలోనూ నిర్లక్ష్యం
- రోడ్లపైనే ఓలలాడుతున్న బూడిద
- అధికారుల నియంత్రణ కరువు

బూడిద చెరువు



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ప్రతిష్టాత్మక ప్రభుత్వ అజమాయిషీ కలిగిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రం. మొత్తం 2600 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ సంస్థ విద్యుత్ ప్లాంట్లను 600 ఎకరాల్లో నిర్మించారు. వెయ్యి ఎకరాల్లో బూడిద చెరువు ఏర్పాటు చేశారు. ఐదు యూనిట్లలో 1760 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న సంస్థగా అత్యధిక విద్యుత్పాదనను అందిస్తున్న థర్మల్ కేంద్రం ఇబ్రహీంపట్నంలో ఉండటం ఎంతో ఘనతగా ఆ ప్రాంత ప్రజలు భావించారు. కానీ నేటి కాలుష్య పరిస్థితి దృష్ట్యా థర్మల్ కేంద్రం తమ పాలిట మృత్యుఘోషగా స్థానిక ప్రజలు భావిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం మండిస్తున్న బొగ్గు నుండి వెలువడే బూడిదను వంద శాతం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దాదాపు బూడిద 40 శాతానికి పైగా గాలిలో, నీటిలో చేరి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంది. బూడిద చెరువు వద్ద కనీస జాగ్రత్తలు (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

కమ్ముకుంటున్న బూడిద



తీసుకోవడంతో ఈ ప్రాంతంలో ధూళి మేఘాలు కమ్ముకుంటున్నాయి. రవాణాలో సైతం సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఏ రహదారి చూసిన బూడిదమయం అవుతుంది. మొత్తంగా 1.20 లక్షల జనాభాను కాలుష్య భూతం పట్టిపీడిస్తుంది. వాతావరణంలో పది మైక్రోన్ల పరిమాణానికి తక్కువగా ఉండే దుమ్ము ధూళి పేరుకుపోతే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నప్పటికీ పర్యావరణ అధికారులు దీన్ని ఏమాత్రం పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. బూడిద ప్రభావంతో ప్రజలకు ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. పర్యావరణ సమతుల్యతకు చర్యలు తీసుకుంటామని పాలకులు ఆర్భాట ప్రచారం చేయడం మినహా ఆ ప్రచారానికి ఇచ్చినంత ప్రాధాన్యత ఆచరణలో చూపడం లేదు. నానాటికి పెరిగిపోతున్న కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ముఖ్యంగా పశ్చిమ ఇబ్రహీంపట్నం, కొండపల్లి, ఈలప్రోలు, తుమ్మలపాలెం, గుంటుపల్లి తదితర ప్రాంతాల ప్రజలు కాలుష్య మహమ్మారితో కాలక్షేపం చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపం... పెరుగుతున్న కాలుష్యం

విద్యుత్తు ఉత్పత్తి సమయంలో బాయిలర్ల వద్ద మండిన బొగ్గంత బూడిదగా మారుతుంది. యూనిట్ వద్ద ఒత్తిడి చేయడం ద్వారా బూడిదను పైప్‌లైన్‌లోకి పంపుతారు. ఈ పైపులైన్ ఇబ్రహీంపట్నం ఎ కాలనీ నుంచి కొండపల్లి ఖిల్లా దిగువనున్న బూడిద చెరువు వరకు ఎనిమిది కిలోమీటర్ల మేర ఉంది. బొగ్గును మండించడం ద్వారా బూడిదను ఫ్యాక్టరీ నుండి బూడిద చెరువుకు తరలిస్తారు. అయితే పైప్‌లైన్ అంతా ఎక్కడికక్కడ లీకులమయంగా మారింది. అనేక చోట్ల పైపులు ఊడిపోయి ఉన్నాయి. దీంతో పైప్‌లైన్ లీకుల ప్రాంతాలు బూడిదతో నిండుతున్నాయి. దీనికి తోడు బూడిద వ్యాపారం లాభసాటిగా ఉండటంతో అక్రమార్కులు పైప్‌లైన్లను ఎక్కడికక్కడే పగలగొట్టి బూడిదను రవాణా చేస్తుండటంతో ఈ ప్రమాదం మరింత పెరిగింది. బూడిద వ్యాపారంపై ప్రభుత్వ అజమాయిషీ, సంస్థ పర్యవేక్షణ లోపం వల్ల సంస్థకు రావలసిన కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతుంది. వాతావరణంలో పది మైక్రోన్ల పరిమాణం కంటే తక్కువగా ఉండే దుమ్ముధూళి పేరుకుపోతే ప్రజలకు చాలా సమస్యలు వస్తాయి. గాలిలో కలిసి ఉండే ఆ ధూళి ప్రజలు, పశుపక్షాదులు ఊపిరితిత్తుల్లోకి చేరుతుంది. దీంతో శ్వాస తీసుకునే సామర్థ్యం క్రమేపి తగ్గిపోతుంది రక్తశుద్ధి చేసేందుకు అవసరమైన ఆక్సిజన్ గుండెకు అందడం లేదు. ఇతర శరీర భాగాలపై ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సమస్యతో బాధపడే వారు సిండ్రోమ్ వ్యాధులకు గురవుతున్నారు. ఇదేవిధంగా బూడిద కాలుష్యం పెరుగుతూ పోతే దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల వ్యాధులు కేన్సర్ చర్మ వ్యాధులు వస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంత జరుగుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజారోగ్యాన్ని నాశనం చేస్తున్న బూడిద కాలుష్యాన్ని నివారించడానికి ఏమాత్రం చొరవచూపకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పర్యావరణ అధికారులు మేల్కొని ప్రజల ఆరోగ్యాలను క్షీణించేలా చేస్తున్న బూడిద కాలుష్యంపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు అంతా సిద్ధం

750 మంది సిబ్బందికి వివిధ డ్యూటీలు కేటాయించామని, అభ్యర్థులు సైతం ఏజెంట్లను మూడు షిప్టుల్లో నియమించుకునేలా అవకాశం కల్పించామని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రదేశం మొత్తం మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, గుర్తింపు కార్డు లేకుండా ఎవర్నీ ఓట్ల లెక్కింపు ప్రాంతానికి అనుమతించబోమని స్పష్టం చేశారు. కౌంటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించరని, పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత మాత్రమే కౌంటింగ్ హాల్లోకి ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని అనుమతిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసేలా ఏర్పాట్లు చేశామని, వీటితో పాటు ఇతర అవసరమైన అన్ని ఏర్పాట్లనూ సిద్ధం చేశామని చెప్పారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

కొనుగోలుకు సంబంధించి సర్వర్‌ను నిలిపివేస్తారు. ఈ నెల రోజుల వ్యవధిలో 4.86 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇంత మేర కొనుగోలు చేసేందుకు ఎప్పటికి అనుమతులు ఇస్తారు? ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేస్తారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సేవా కేంద్రాలకు, మిల్లర్ల వద్దకు వెళితే అనుమతులు రాలేదని తిప్పి పంపేస్తున్న సంఘటనలు జిల్లాలో బయట పడుతున్నాయి. అయితే రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద వైఖరిని ఆసరాగా మలచుకుని మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు ధర తగ్గించి అడుగుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. ఒకవేళ వారు చెప్పిన ధరకు ధాన్యం విక్రయించినా నగదు చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతుందని షరతులు పెడుతున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు.

కృష్ణాజిల్లాలో 302 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సంక్రాంతి పండుగ ముందు వరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. ఆ తర్వాత మిల్లు యజమానులు చెల్లించిన బ్యాంకు గ్యారంటీ అయిపోయిందని, మిల్లులకు ఇచ్చిన ధాన్యం టార్గెట్లు పూర్తయ్యాయని ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. ప్రస్తుతం మినుమ తీత పనులు జరుగుతున్నాయి. దీంతో పాటే రైతులు కుప్పనూర్పిడి చేస్తున్నారు. ధాన్యం శాంపిళ్లను రైతు సేవా కేంద్రాలకు రైతులు తీసుకువెళితే ఆన్లైన్ ప్రక్రియ నిలిచిపోయిందని, ప్రభుత్వంతో సంబంధం లేకుండా రైస్ మిల్లులకు ధాన్యం విక్రయించుకోవాలని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం కుప్పల్లో ధాన్యం 2.38 లక్షల టన్నుల ధాన్యం ఉందని, కుప్పలు నూర్పిడి చేసి విక్రయించడానికి రైతుల వద్ద మరో 2.48 లక్షల టన్నులు ఉందని పౌర సరఫరాల శాఖ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను పంపారు. ఈ ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు జాయింట్ కలెక్టర్ ద్వారా లేఖ రాసినట్లు తెలుస్తోంది. అయినా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలుకు అనుమతులు మాత్రం రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల ధాన్యం బస్తా రూ.1,725 కొనుగోలు చేయాల్సి ఉండగా. రైతులు మిల్లు యజమానుల వద్దకు ధాన్యం శాంపిళ్లను తీసుకువెళితే రూ.1,520లకు కొనుగోలు చేస్తామని



చెబుతున్నారు. ప్రైవేటుగా కొనుగోలు చేసిన ధాన్యం మరపట్టి బియ్యంగా మార్చి కాకినాడ పోర్టుకు తరలించాలని, దీంతో అన్ని ఖర్చులు కలుపుకుని అంతకుమించి ధరను ఇవ్వలేమని మిల్లర్లు తెగేసి చెబుతున్నాట్లు రైతులు చెబుతున్నారు. పైగా ఈ ధరకైనా ఇప్పటికిప్పుడు ధాన్యం కొనుగోలు చేయలేమని, ధాన్యం బిల్లులు ఆలస్యమవుతాయని చెప్పడం గమనార్హం. ఎకరానికి 30 బస్తాల ధాన్యం దిగుబడి వస్తే ఈ ధరకు రైతులు ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర బస్తాకు రూ.225లను నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పౌరసరఫరాల సంస్థ అధికారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలుకు అనుమతులను త్వరగా ఇవ్వాలని కోరుతున్నారు.

మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలి. లక్ష్యం అయిపోయింది ఇక ధాన్యం కొనుగోలు చేయలేమని ప్రభుత్వం నుండి అనుమతులు రావాల్సిందేనని జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నార. అనుమతులు రాకపోతే రైతుల వద్ద ఉన్న ధాన్యం సముద్రంలో పారాబోయలా? ఏ ఒక్క రైతుకి నష్టం లేకుండా మద్దతు ధరతో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలని లేదంటే రైతు సంఘం పక్షాన ఉద్యమం చేపడతాం. అధికారులు కూడా స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

చైల్డ్ కేర్‌కు చిన్నారి అప్పగింత

ప్రజాశక్తి-విజయవాడ: టాస్క్‌ఫోర్స్ ఏడిసిపి ఎ.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏసిపి కె.లతాకుమారి, నార్త్ ఏసిపి స్రవంతి రాయ్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, నున్న ఇన్స్పెక్టర్లు వారి సిబ్బందితో కలిసి ఈ నెల 1న శనివారం సులభంగా డబ్బులు సంపాదించడం కోసం పిల్లలు లేని వారిని, సంతానలేమితో బాధపడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమంగా చిన్న పిల్లలను విక్రయించే ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద విక్రయించడానికి ఉంచిన ముగ్గురు పిల్లలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఆదివారం లతాకుమారి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు సిబ్బందితో కలిసి నిందితులు విక్రయించిన మరొక చిన్నారిని రాజమండ్రి సీతానగరం సమీపంలో కనుగొని ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్మెంట్‌కు అప్పగించారు.

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-చందర్లపాడు

వ్యవసాయ అప్పులతో ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు ఇనుకొల్లు నరసింహారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఏపి రైతుసంఘం, ఏపి కౌలురైతుల సంఘం నాయకులు నరసింహారావు కుటుంబాన్ని ఆదివారం కోనయపాలెంలోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతులను ఆదుకోవడంలో విఫలం చెందడం వల్లే నరసింహారావు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వనిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యల్లమందారావు, ఎన్టీఆర్ జిల్లా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు సుబ్బారావులు పాల్గొన్నారు.

విజయవాడ ఊసేలేదు..!

• పెండింగ్‌లో పలు ప్రాజెక్టులు • బడ్జెట్‌లో పైసా విదల్చని వైనం



ప్రజాశక్తి-విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్‌లో అర్బన్ డవలప్‌మెంట్‌లో భాగంగా రాజధానికి సమీప నగరం అయిన విజయవాడ అభివృద్ధి ఊసే లేకుండా పోయింది. నిధుల సమస్యతో ఏళ్ల తరబడి విజయవాడ నగరంలో అనేక ప్రాజెక్టులు శిలాఫలకాలతో వెక్కిరిస్తూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 పూర్తి స్థాయి బడ్జెట్‌లో విజయవాడ నగరాభివృద్ధికి ఎంతో కొంత నిధులు కేటాయిస్తారు...ఇక్కడి ప్రధాన ప్రాజెక్టులు పూర్తి అవుతాయనే నగర ప్రజల ఆశ... చివరకు నిరాశగా మిగిలింది. బడ్జెట్‌పై రాష్ట్ర మునిసిపల్‌శాఖామంత్రి నారాయణ ప్రసంగంలో కూడా విజయవాడ నగరానికి సంబంధించి నిధుల అంశంపై కనీసమైన ఊసే లేకుండా పోయింది. ఈ నగర ఆర్థిక పరిస్థితి, అప్పులు, పూర్తి చేయాల్సిన పలు ప్రాజెక్టులు తదితర అంశాల విషయంపై సంబంధిత మంత్రి మాటల్లో ఎక్కడా నిధుల అంశం ప్రస్తావనే కనిపించలేదని విపక్షాలు మండిపడుతున్నాయి. మంత్రి నారాయణ స్వయంగా ఈ నగరంలోనే నివాసముంటున్నారు.ఈ నగర పరిస్థితి కూడా తెలిసిందే. అంతేగాక స్థానిక విజయవాడ ఎంపి, కూటమి ఎమ్మెల్యేలు, విఎంసిలో స్థానిక అధికార వైసిపి పాలకర్గం, ప్రధాన ప్రతిపక్షం టిడిపి కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి,ఈ నగరానికి అవసరమైన నిధుల కేటాయింపులు చేయించుకోవడంలో కూడా ఘోరంగా విఫలమయ్యారనే చర్చ నడుస్తుంది. విజయవాడ నగర వరద నివారణా చర్యలు చేపట్టాల్సి ఉంది. బుడమేరు ముంపు నివారణకు, అలాగే మధ్యలోనే నిలిచిపోయిన వర్షపునీటి కాలువల నిర్మాణం ప్రాజెక్టును పూర్తి చేయడానికి వందల కోట్ల నిధులు అవసరం. కానీ ఈ బడ్జెట్‌లో ఒక్క పైసా నిధులు కేటాయించలేదు. స్టామ్ వాటర్ డ్రెయినేజీ స్కీమ్ కింద విఎంసికి కేటాయించిన రూ. 461 కోట్ల నిధుల్లో రూ. 289 కోట్లు నేటికీ రాష్ట్ర ప్రభుత్వం వద్దనే ఉన్నాయి. ఈ నిధుల మంజూరు అంశం ఊసే లేకుండా పోయింది. అలాగే ఇటీవల నగరాన్ని ముంచెత్తిన బుడమేరు ముంపు శాశ్విత నివారణా చర్యలు-ఈ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల అంచనా కూడా రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలోనే ఇటీవల చర్చ జరిగిన విషయం తెలిసిందే. కానీ ఈ పనులకు సంబంధించి బడ్జెట్‌లో నిధుల ప్రస్థావనే లేదు. కృష్ణానది పక్కనే ఉన్నాకానీ... 40 శాతంకు పైగా నగర ప్రజలు నేటికీ బోర్ వాటర్‌నే తాగాల్సిన దుస్తితి నెలకొన్నది. పలు ప్రాంతాలకు మునిసిపల్ వాటర్ సరఫరా అవుతున్నా తాగడానికి వీలు లేని వైనం నెలకొన్నది. దీంతో పలు మంచినీటి ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంది. పది డివిజన్ల పరిధిలో లక్ష మందికి పైగా ఉన్న సింగ్‌నగర్‌కు ఫిల్టరేషన్‌ప్లాంట్‌తోపాటు మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణంతో పాటు ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్న కృష్ణలంక ప్రాంత మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అలాగే ఇప్పుడున్న మంచినీటి పైప్‌లైన్లను మరమ్మతు పనులకు కోట్లాది రూపాయలు నిధులు అవసరం కానున్నది. పెరుగుతున్న రద్దీకనుగుణంగా రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ, పుట్‌పాత్‌ల నిర్మాణం, వీటికనుగుణంగా విద్యుత్ పునర్వ్యవస్తీకరణ వంటి భారీ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉంది. వీటికయ్యే వేల కోట్ల నిధులను విఎంసి భరించే పరిస్తితి లేదు. ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయలేదు. గడిచిన 15 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉండి, మొండి గోడలకే పరిమితం అయిన గుణదల ప్లైఓవర్, సింగ్‌నగర్ రెండవ ప్లైఓవర్, పలు ఆర్‌యుబిల పనులు నిధుల సమస్యతో అవి ఎప్పటికీ పూర్తి అవుతాయో ప్రశ్నార్థకంగా తయారయింది. విజయవాడ రూరల్ రాయనపాడు రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మెయిల్ రైల్వే స్టేషన్‌కు, అలాగే గుణదల రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌కు అప్రోచ్‌రోడ్లు వేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకునే విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులు లేనే లేవు. ఈ ప్రాజెక్టుకు రూ.11 వేల కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. కృష్ణానదిలో వాటర్ లెవల్స్ పెంచి, భౌష్యత్ అవసరాలు తీర్చడానికి వీలుగా ప్రకాశం బ్యారేజి దిగువ చోడవరం వద్ద బ్యారేజీ నిర్మాణం కాగితాలకే పరిమితం అయింది. నగరానికి ఎంతో ముఖ్యమైన ఔట్ రింగ్ రోడ్డు పనులు ఇంకా 20 శాతంకు పైగా పనులు పూర్తి కావాల్సి ఉన్నా...ఇన్నర్‌రింగ్ రోడ్డు ఆవశ్యకత ఎంతో ఉన్నప్పటికీ...నేటికీ కార్యాచరణకు పూనుకోలేదు. నగరంలోని లక్షలాది మంది పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఇళ్లు, ఇళ్లస్థలాల సమస్య వెంటాడుతూనే ఉంది. టిడ్కో గృహాలు నిర్మాణం జరిగినా...వాటి కేటాయింపు కానీ, వీటి వద్ద మౌలిక సదుపాయాలు కల్పన జరగనే లేదు. నిధుల సమస్య వెంటాడుతూనే ఉంది. ఇలా అనేక ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు ఈ బడ్జెట్‌లో నిధుల ఊసే లేకుండా పోయింది.

సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయాలి



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా శాఖ అధ్యక్ష , కార్యదర్శులు పి రాము, తోట వరప్రసాద్ లు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు పి రాము ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రణా శిక బద్ధంగా రేషనలైజేషన్ చేయకపోతే క్షేత్రస్థా యిలో పలు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఉద్యోగులు ముఖ్యంగా మహిళా ఉద్యోగులు చాలా ఆందోళనతో ఉన్నారన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఉద్యోగం పరంగా ఇప్పటికే విధి నిర్వహణలో అనగా శానిటైజేషన్ సంబంధించి, ప్లానింగ్ విభాగానికి సంబంధించి, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ వివిధ విభాగాల కార్యదర్శులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒక్కరోజు సెలవు కావాల్సి వస్తే అనేకమంది అనుమతులు తీసుకుంటే గాని సెలవు దొరకట్లేదని, సమయపాలనంటూ లేకపోవడం వలన వ్యక్తిగత జీవితాలను నష్టపోతున్నరన్నారు.కాబట్టి ఈ ప్రభుత్వం మానవతా దృక్పథంతో సచివాలయం ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యల పట్ల సానుకూల దక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఆఫీస్ బేరర్లు జి శ్రీనివాస్, రామారావు, సురేష్ నాయక్, బాలాజీ, రాంబాబు, కోటేశ్వరరావు , హుస్సేన్, సలీం మహిళా విభాగం అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పెంచిన చలానా ఛార్జీలతో వాహన యజమానులు బెంబేలెత్తుతున్నారు. మార్చి 1వ తేదీ నుండి విపరీతంగా పెంచిన చలానా ఛార్జీలతో వాహన దారులు రోడ్డు మీదకు రావాలంటేనే భయపడుతున్నారు.గుడ్లవల్లేరు ఎస్సై ఎన్‌వివి సత్యనారాయణ వాహనాల తనిఖీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా రోడ్లపై ప్రయాణించే వారిపై చలనాలు విధిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వాహనదారులు సంబంధిత ఆర్సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని కోరారు. లేనియెడల వేలకి వేలు చలానాలు విధించేందుకు మార్చి ఒకటో తేదీ నుండి అధిక చలానాలు విధిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పవన్‌పై వ్యాఖ్యలకు ఖండన



ప్రజాశక్తి-కోడూరు : ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకోవాలని, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ గురించి అవకులు చవాకులు పేలితే సహించేది లేదని జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సినిమాలు నటించడం ద్వారా వచ్చిన డబ్బుతో పార్టీని నడుపుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా అనేక వేల మంది కౌలు రైతు కుటుంబాలకు పవన్ కళ్యాణ్ తన కష్టార్జితాన్ని ఇచ్చి ఆదుకున్నారని, అటువంటి పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడితే ఏమాత్రం సహించేది లేదని ఆమె అన్నారు. వ్యక్తిగత విమర్శలు చేయడం వైసిపి నాయకులు పరిపాటిగా మారిందన్నారు.

ఎఎఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ స్కూల్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కూరపాటి అజయ్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఎఎఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 37వ వార్షికోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. శనివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో సొసైటీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మాజీ ఐఆర్ఎస్ అధికారి, సీఈవో హీల్ పారడైజ్ తోటపల్లి కూరపాటి అజయ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య అనేది బట్టి పెట్టి చదివేది వచ్చేది కాదని, ఆలోచన శక్తిని పెంపొందించే విధంగా ఉండాలని, కథలు పుస్తకాలు జాతీయ నాయకులు చరిత్ర చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చదువులో ఉన్నతంగా రాణించిన విద్యార్థులకు నగదు బహుమతులను వివిధ రకాల టాలెంట్ టెస్ట్‌లో విజయం సాధించిన విద్యార్థులను, శిక్షణను ఇచ్చిన అధ్యాపకులకు వివిధ రకాల ఆటలు పోటీల్లో శిక్షణను ఇచ్చిన పిఇటిలను మోమెంటులతో సత్కరించారు. సాంస్కతి కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు విచిత్ర వేషధారణ శాస్త్రీయ నత్యాలు జానపద నత్యాలు అందర్నీ కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు వల్లభనేని సుబ్బారావు ,ఉపాధ్యక్షులు కొడాలి వెంకటకష్ణారావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ , పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ రాజశేఖర్ ఇంజనీరింగ్ కాలేజీ పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ జి వి ఎస్ ఎన్ ఆర్ వి ప్రసాద్, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మణరావు, పాఠశాల ప్రిన్సిపాల్ సాతులురి లీనా పాల్గొన్నారు.





120 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్, హెూప్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. అసోసియే షన్ జిల్లా వైద్య విజ్ఞాన చైర్మన్ సంగం తిరుమలరావు, డిప్యూటీ గవర్నర్ పొగిరిరాము, నెల్లి రాంబాబు, ఉయ్యూరు అసోసియేషన్ అధ్యక్షుడు కోడె సాంబశివరావు, సెక్రటరీ చంటిబాబు, ట్రెజరర్ గోకా శ్రీనివాసరావు, పీఆర్వో రాజు పాల్గొని సేవలందించగా హెూప్ హాస్పిటల్ వైద్యులు శ్రీనివాసరెడ్డి, జ్యోతి, వైద్య సిబ్బంది వైద్యసేవలందించారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి గ్రామ దేవత శ్రీ సంపటాలమ్మ అమ్మవారిని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదివారం దర్శించుకున్నారు. గ్రామ ప్రజలను చల్లగా కాచి రక్షించే చల్లని దైవం శ్రీ సంపటాలమ్మ తల్లి అమ్మవారి దేవాలయ 26వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు, ఆలయ అర్చకులు ఆయనను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఉప



సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నానీ), టీ.ఎన్.టీ.యూ.సీ రాష్ట్ర నాయకులు రావి చంద్రశేఖర్ (చిట్టి), ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.




వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : బిగ్ టీవీ ఆధ్వర్యంలో పామర్రు శతి హాస్పిటల్ సౌజన్యంతో నారాయణరావు నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో పామర్రుకు చెందిన శతి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శతి పర్యవేక్షణలో వైద్య సేవలు అందించారు. రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బిగ్ టీవీ మెగా వైద్య శిబిరాన్ని చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్(నాని), వేముల హరి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరామ్ వెంకట సత్యనారాయణ(నాని), మోపిదేవి ద్వారకానాథ్, మత్తి రాంబాబు, వెనిగళ్ళ తారక జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల టిడిపి అధ్యక్షులు, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు యాసం చిట్టి బాబు జన్మదిన వేడుకలు ఆనగడ్డలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు ఏర్పాటుచేసిన కేకును కట్ చేయగా ఆయనకు పార్టీ నాయకులు కార్యకర్తలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చిట్టిబాబును సత్కరించారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద చిట్టిబాబుకు శాలువా కప్పి సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎలవర్తి చిన్నతో పాటు పలువురు టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు.



చిట్టిబాబును సత్కరిస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

బందరులో పుట్టి పెరగడం అదృష్టం

- సినీ రచయిత బెజవాడ ప్రసన్న కుమార్



మాట్లాడుతున్న బెజవాడ ప్రసన్నకుమార్

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలో పుట్టి పెరగడం తన అదృష్టమని, మాతృగడ్డపై విజయవంతమైన మజాకా సినిమా మీడియాతో కలిసి తిలకించడం పూర్వజన్మ సుకతం అని మజాకా సినిమా కథ, మాటల రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివార స్థానిక రేవతి థియేటర్ వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందరు వాస్తవ్యుడను అయినందున మీడియా తనకు అపూర్వ స్వాగతం పలికి సన్మానించడం తన పూర్వజన్మ సుకతం అన్నారు. కథ, స్క్రీన్ ప్లే,మాటలతో నిర్మితమైన మజాకా సినిమా విజయవంతమైందని తాను కష్టపడి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, నేడు ఈ స్థితికి రావడానికి కారణమైన దర్శక, నిర్మాతలకు, సినీ రంగానికి ఎల్లవేళలా కతజ్ఞత కలిగి ఉంటానన్నారు. తనకు మొదటి నుండి సినిమాలకు కథలు మాటలు రాయాలని సంకల్పం ఉండేదని, ఆ సంకల్ప బలమే తనను ఈ స్థితికి తీసుకు వచ్చిందని, పట్టుదలతో అనుకున్నది సాధించడం తన లక్ష్యమని అన్నారు. మచిలీపట్నం ప్రజలకి ఎల్లవేళలా రుణపడి ఉంటానని ప్రసన్న కుమార్ అన్నారు. ఇంతకుముందు సినిమా చూపిస్త మామ, హలో గురు ప్రేమకోసమే, ధమాకా, నేను లోకల్, నాన్న నేను నా బాయ్ ఫ్రెండ్స్ తదితర చిత్రాలు ద్వారా బెజవాడ ప్రసన్నకుమార్ ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ ను అభిమానులు మేళతాళాలతో రేవతి థియేటర్ వరకు అపూర్వ స్వాగతాన్ని పలికారు.ఈ కార్యక్రమంలో షరీఫ్,రాజేష్, రామకష్ణ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.రేవతి థియేటర్ మేనేజర్ బెజవాడ ప్రసన్నకుమార్ కు స్వాగతం పలికారు.



టాలెంట్ టెస్ట్ నిలిపేస్తున్న దృశ్యం

టాలెంట్ టెస్ట్ నిలుపుదల

ప్రజాశక్తి - తిరువూరు : నారాయణ కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం తిరువూరు జైభవి సెంటర్‌లోని తన బ్రాంచ్ స్కూల్లో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌ను రద్దు చేయాలని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యం ఆదివారం ఆందోళన చేసింది. దీనితో మండల విద్యాశాఖ అధికారి ఎం.శ్యాంసుందరరావు పాఠశాలకు వచ్చి విద్యార్థులు రాస్తున్న టాలెంట్ టెస్ట్ నిలుపుదల చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నారాయణ స్కూల్లో టాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించడం దుర్మార్గమని వివిధ ప్రయివేట్ పాఠశాలలకు చెందిన అధినేతలు ఉప్పలపాటి చక్రపాణి, కె.నరసింహారావు, చారి, నాగిరెడ్డి తదితరులు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రికి సంబంధించిన పాఠశాల కావడంతో నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. మంత్రి కోర్టు, ప్రభుత్వ ఆదేశాల్ని ఉల్లంఘిస్తే మరి ప్రైవేటు పాఠశాలాల యాజమాన్యాలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.



కంప్యూటర్లు బహూకరణ

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి గుడేటి జీవన్ రావు 10 కంప్యూటర్‌ను అంద జేశారు. పాఠశాల ఆవరణం లో జరిగిన కార్యక్రమంలో అదే పాఠశాల ఉపాధ్యా యుడు తన మిత్రుడు బాణావతి రాము నాయక్ ద్వారా హెచ్‌ఎం కె జలజాకు కంప్యూటర్ అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి జీవన్‌రావు సహకారం అందించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ఉపాధ్యాయులు ముక్క సత్యనారాయణ, జామా మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

ప్రజాశక్తి - గంపలగూడెం : ఆదివారం ఘనంగా రంజాన్ వేళలు ప్రారంభ మైనట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. ఉదయం 5 గంటల నుండి ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిమ్స్ పలుమార్లు మసీదులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలు వినగడప, గోసవీడు, జింకల పాలెం, గంపలగూడెం, లింగాల, ఊటుకూరు గ్రామాల్లో జరిగాయి. సాయంత్రం 6:30 గంటలకు ఆయా మసీదులలో పెద్దల ఆదేశాల మేరకు విస్తార విందు స్వీకరించారు. ఆదివారం మొదలుకొని మరల నెలవంక కనిపించేంతవరకు అనగా, నెలరోజుల పాటు ఈ ఉపవాస దీక్షలు ఉంటాయని తెలిపారు.



ఇఫ్తార్ విందులో ముస్లిములు

మహిళా ఉద్యోగులకు మనోధైర్యం అవసరం

ఎపి ఎన్‌జిజిఒ మహిళా విభాగం చైర్ పర్సన్ వి.నిర్మల కుమారి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి కలిగిన మహిళల గౌరవాన్ని కాపాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఎపి ఎన్‌జిజిఒ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆహ్లాదకరంగా నిర్వహిస్తున్నట్లు ఎపి ఎన్‌జిజిఒ మహిళా విభాగం రాష్ట్ర చైర్ పర్సన్ వి.నిర్మలా కుమారి తెలిపారు. గాంధీనగర్‌లోని ఎన్జిజిఒ హోంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ నిర్వహణ వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వేదికగా రవాణా, క్రీడా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి ఈ పోటీలు ప్రారంభిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 1.00 నుంచి 7 గంటల వరకు టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, షటిల్ (డబల్స్), అంత్యాక్షరి పోటీలు జరుగుతాయన్నారు. ఏపీ ఎన్జీజీఓ హోం వేదికగా 5వ తేదీన చెస్, క్యారమ్స్ (డబల్స్), తెలుగులో వ్యాసరచన, ఒక్క నిమిషం పాటు ఎటువంటి ఆంగ్ల పదాలు వాడకుండా తెలుగులో ప్రసంగించే పోటీలలో మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. 6న సాయంత్రం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు సినీ, జానపద, లలిత కళ పోటీలు, నృత్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు 8న గాంధీనగర్‌లోని ఎన్జీజీవో హోంలో జరిగే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బలహీన వర్గాల శాఖ మంత్రి, ఎస్.సవిత, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ విభాగం కమిషనర్ రేఖా రాణి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. మహిళా విభాగం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి అలపర్తి విద్యాసాగర్ అన్ని విధాలుగా సహకరిస్తున్నారని వారికి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ పి.మాధవి మాట్లాడుతూ మహిళల హక్కులను రక్షించేందుకు, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించేందుకు, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రాముఖ్యతను గుర్తించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం 1909లో అమెరికాలో మొదటిసారి నిర్వహించారన్నారు. ఈ సమావేశంలో ఎపిఎస్ జిఇఎఫ్ మహిళా కమిటీ కన్వీనర్ ఎం.రాజలక్ష్మి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.జానకి, రాష్ట్ర కార్యదర్శి బి.తులసి రత్నం, రాష్ట్ర మహిళా విభాగం నాయకులు లలితాంబ, శాంతిశ్రీ, శివలీల, విజయ శ్రీ, మల్లీశ్వరి, సురేఖ, సరస్వతి తదితరులతోపాటు క్యాపిటల్ సిటీ బ్రాంచ్ అమరావతి మహిళా నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేసుస్తున్న ఎపి ఎన్‌జిజిఒ మహిళా విభాగం చైర్‌పర్సన్ నిర్మల, తదితరులు

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ : దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రతి కుటుంబంలో ఒక్కొక్కరికి ఉచితంగా దోమలతెరలు ఇవ్వాలని కోరుతూ వాంబే కాలనీ 'ఈ'బ్లాక్‌లోని శానిటరీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ జైపాల్‌కి సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడుతూ దోమల బెడద ఉంచి ఈ ప్రాంత ప్రజలను కాపాడాలని కోరారు. దోమల నియంత్రణకు విఎంసి తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం లేదని, ఫలితంగా దోమ కాటు ఎక్కువై ఈ ప్రాంత ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దోమల బెడదతో పగటి పూట కూడా ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని అన్నారు. డంపింగ్‌యార్డు దగ్గరలో ఉండటం, చెత్తా చెదారం వీధుల్లో పెరిగిపోతూ, అధ్వాన్నంగా డ్రైయినేజి వ్యవస్థకారణంగా దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. దోమల నివారణకు ప్రకటనలకే ప్రజారోగ్య విభాగం పరిమితం అయిందని అన్నారు. పెరిగిపోతున్నా దోమల తీవ్రతకు పగలు రాత్రి అని తేడా లేకుండా ప్రజల రక్తాన్ని పీల్చుకు తింటున్నాయని రాత్రి సమయంలో నిద్ర కూడా పోలేని పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్, పదోతరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విపరీతమైన దోమల కారణంగా విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దోమ కాటు కారణంగా ప్రజలు అనారోగ్యాలకు గురికావడంతో పాటు వంటి నిండా దద్దుర్లు వస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో నగరంలోని ప్రతి డివిజన్లో ఆందోళన చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ నగర కమిటీ సభ్యులు ఎస్‌కె పీరుసాహెబ్, స్థానిక సి.పి.ఎం నాయకులు కె.ఓంకార్, ఎస్.అప్పన్న, పి.రవి, జి.సాయి, ఐద్వా నాయకురాలు కదిరి.కాంతమ్మ , సురేష్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



ఇంద్రకీలాద్రిపై యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - వన్ టౌన్ :
ఇంద్రకీలాద్రిపై యాత్రికుల రద్దీ ఆదివారం పెరిగింది. ఆర్జిత సేవల్లో యాత్రికులు విశేషంగా పాల్గొన్నారు. యాత్రికుల రద్దీకి తగ్గట్టుగా పార్కింగ్, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్న ప్రసాదాలు సత్వరం అందేలా దేవస్థానం అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ సుజనా

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - వన్‌టౌన్
కొత్తపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ ఎంఎల్ఎ యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయాన్ని నిర్మించి 104 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజగోపురం, ఆంజనేయస్వామి, గరుత్మంతుని విగ్రహాలను, ధ్వజస్తంభం పున:ప్రతిష్ట చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు సారిపల్లి రాధాకృష్ణ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మురపాల దుర్గారావు, బోరా కనకారావు, నమ్మి భాను ప్రకాష్, ఐతా కిషోర్, జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైనే మురుగు నీరు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో గ్రామంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఒకప్పుడు బహిరంగ బహిర్భూమి రహిత గ్రామపంచాయతీగా ఉన్న గొట్టుముక్కల ఇప్పుడు బహిరంగ బహిర్భూమిగా మారింది. స్థానిక ధనలక్ష్మి కాలనీ దగ్గర నుండి గొట్టుముక్కలలో అన్ని ప్రాంతాలలో చెత్త చెదారం పేరుకు పోయి అంటు వ్యాధులకు నిలయంగా మారింది. గొట్టుముక్కల నుండి కంచికచర్ల వెళ్లే రహదారిలో ఉన్న ధనలక్ష్మి కాలనీ దగ్గర డ్రైనేజ్ సరిగా లేకపోవడంతో డ్రైనేజీలో ఉన్న నీరంతా తారు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో వచ్చేపోయే వాహనాలపై ఈ నీరు చింది వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దుర్గంధపూరితమైన ఈ మురుగునీరు వలన ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఏర్పడింది ధనలక్ష్మి కాలనీ పక్కనే చెత్తాచెదారం పేర్కొనిపోయి రోడ్డుపై వెళ్లే ప్రజలకు దుర్వాసన వెదజల్లుతుంది. కార్లలో వెళ్లే నాయకులకు ఈ దుర్గంధం వాసన, చెత్తాచెదారం కనిపించడం లేదని జనం ఆరోపిస్తున్నారు. పాత హరిజనవాడ దగ్గర కట్టెల డొంక రోడ్డుపై పేర్కొన్న చెత్త గ్రామాలకు వెళ్లి బైపాస్ రోడ్డులో వెళ్లాలంటే భయంకరమైన పరిస్థితి అలానే గ్రామంలో శ్మశానానికి వెళ్లే రోడ్డు గాని అలానే పేరకలపాడు డొంకకు వెళ్లాలంటే భయానక స్థితి నెలకొందని జనం అంటున్నారు. ప్రతిరోజు గ్రామ పంచాయితీ సిబ్బంది, పరిపాలకులు ధనలక్ష్మీ కాలనీ దగ్గర రోడ్డు పై ప్రవహించే మురుగును దాటుకుంటూ వస్తున్నా, ఆవేమి కనిపించదని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. ప్రతిరోజు పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం గొట్టుముక్కల పంచాయితీ సిబందికి బేఖాతరని జనం అంటున్నారు. ఇప్పటికైనా పాలకవర్గ ప్రతినిధులు, పంచాయితీ సిబ్బంది మొద్దు నిద్ర వీడి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో రహదారిపైనే పారుతున్న మురుగునీరు



నెత్తురోడుతున్న రహదారులు

- దేంజర్ జోన్లలో నిత్యం ప్రమాదాలు
- విద్యుత్ దీపాలు వేయాలని పలువురి విన్నపం
- ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో ప్రమాదాల నివారణ

గన్నవరం మండలంలోని కేసరపల్లి నుంచి చిన ఆవుటపల్లి ఆసుపత్రి వరకు పలు డేంజర్ జోన్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ గ్రామాల మధ్య ఉన్న దూరం ఏడు కిలో మీటర్లు. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మతి చెందారు. 30 మంది గాయ పడ్డతారు. కేసరపల్లి వద్ద ఉన్న రెండు క్రాసింగ్ల వద్ద నెలకో ప్రమాదం జరుగుతుంది. రహదారి నెత్తురోడుతోంది. ద్విచక్ర వాహనాల వారు రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తుండగా వేగంగా వస్తున్న వాహనాలు ఢీ కొడుతున్నాయి. ఇలాంటి సంఘటనలు పది వరకూ జరగ్గా, నలుగురు మృతి చెందారు.





ప్రజాశక్తి-గన్నవరం : ఆర్టీసి బస్సులు స్పీడ్గా రహదారి క్రాస్ చేయటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదమరిచి రోడ్డు దాటితే అంతే సంగతులు. ప్రాణాలు గాలిలో కలిసి పోతాయి. అదే విధంగా విమానాశ్రయం ఎదురుగా నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇక్కడ ఆర్టీఓ కార్యాలయం ఉండటంతో వాహనాలు రోడ్డు ప్రక్కన నిలిపేస్తున్నారు. ఫలితంగా కొన్నిసార్లు వాహనాలు ఢీ కొంటున్నాయి. కొత్తపేట వద్ద ప్రమాదం జరిగిందో ప్రాణం పోవాల్సిందే. ఊర చెరువు నుంచి వస్తున్న క్వారీ లారీలు, రోడ్డుపై వేగంగా వచ్చే లారీలు రహదారి దాటుతున్న వారిని ఢీ కొడుతున్నాయి. నలుగురు మణించిన సంఘటనలు జరిగాయి. గాయపడిన వారి సంగతి సరేసరి. జనకూడలి ప్రాతంకావటంతో విద్యుత్ దీపాలు వేయించాలని కోరినా అధికారులు పట్టించుకోవటం లేదు. ఇపుడు కొత్తగా ఒక స్కూలు పెట్టడంతో పిల్లలు వందల సంఖ్యలో వ స్తున్నారు. ఎప్పుడేం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం తక్షణంగా ఉంది. గాంధీబొమ్మ సెంటర్, వెంకటేశ్వరా థియేటర్ సెంటర్, బస్టాండ్ సెంటర్లు డేంజర్ జోన్లు అని చెప్పాలి. తరచూ ఇక్కడ ఏదొక ప్రమాదం జర గుతూనే ఉంటుంది. గత రెండు నెలల కాలంలో పది ప్రమాదాలు జరిగాయి. వీటిలో 14 మంది గాయపడ్డారు. పోలీసు స్టేషన్కి వెళ్లింది ఇద్దరే. అందరూ రాజీలు చేసుకుని సర్దుకుంటున్నారు. పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్ కంట్రోలు చేస్తే గానీ ప్రమాదాలు తగ్గవు. గన్నవరం పో లీసు స్టేషన్లో సిబ్బంది తక్కువగా ఉండటంతో ట్రాఫిక్ కంట్రోల్ చేసే పరిస్థితి లేదు, అప్పుడప్పుడు సిఐ, ఎస్ఐలు రహదారి మధ్యలో నిలబడి హడావుడి చేస్తుంటారు. ప్రమాదాలు జరిగే సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పెడితే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు నిధులు లేవని వదిలేశారు. ఉడా అధికారులు లైట్లు వేస్తామని చెప్పారేగానీ చేయలేదు. ఆపని చేయాలంటే కొంత పంచాయతీ నుం చి నిధులు చెల్లించాలని అధికారులు నిబంధన పెట్టడంతో వాటి ఏర్పాటు ఎవ్వరూ ముందుకు రావటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

540 మందికి వైద్య పరీక్షలు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 540 మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు కణితి శశిరేఖ హనుమకొండ దుర్గ భవాని, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగం శెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి గుడివాడ హెూమియో వైద్యులు పి భవాని, తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం శివారు పద్మాలపాలెంలో మారుబోయిన రాకడ మణిమ్మ మెమోరియల్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్ చలివేంద్రంను టిడిపి నాయకులు, విజయ డైరీ జిల్లా డైరెక్టర్ వల్లభనేని బాబురావు, గ్రామ టిడిపి నాయకులు మలిపెద్ది సుబ్రహ్మణ్యంలు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ సిహెచ్ యోహాన్ దేవదాస్ సంఘ సభ్యులు యూత్ ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన జిల్లాస్థాయి క్రీడలు -2025 ఆదివారంతో ముగిశాయి. హెచ్ సి ఎల్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కష్ణాజిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులు(బాల బాలికలు) హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఈవో) యు. వి. సుబ్బారావు మాట్లాడుతూ హెచ్ సి ఎల్ ఫౌండేషన్ దేశంలోనే పలు ప్రాంతాల్లో స్పోర్ట్స్ ఫర్ చేంజ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గవర్నమెంట్ పాఠశాల విద్యార్థులను ఈ పోటీల్లో భాగస్వాములు చేయడం ద్వారా వారిలో క్రీడా స్ఫూర్తిని మరింత పెంచుతున్నట్టు చెప్పారు. ఆటల్లో పాల్గొనడం ద్వారా శారీరక సామర్థ్యాన్ని మెరుగుపర చడానికి వీలుంటుందని అన్నారు. రెండు రోజులపాటు జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్స్ లో భాగంగా 100 మీటర్లు, 300 మీటర్లు, 800 మీటర్లు రన్నింగ్, లాంగ్ జంప్ , హై జంప్ , జావలిన్ త్రో , షాట్ పుట్, మిడ్లే రిలే విభాగాల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గేమ్స్ విభాగంలో హ్యాండ్ బాలు, హాకీ, బాస్కెట్ బాల్ , వాలీబాల్, ఫుట్బాల్ క్రీడల్లోనూ పోటీపడ్డారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని సౌత్ జోన్ హెచ్ సి ఎల్ ఫౌండేషన్ పోటీల్లో పాల్గొనేందుకు చేశారు. బాలుర ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ను తోటపల్లి హీల్ పారడైజ్ పాఠశాల కైవసం చేసుకోగా బాలికల ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ను గొడవర్రు జడ్.పి.ఉన్నత పాఠశాల చేజిక్కించుకుంది. ఈ కార్యక్రమంలో హీల్ సంస్థ సి.ఈ.ఓ కే. అజయ్ కుమార్, ప్రాజెక్టు మేనేజర్ సత్యానారాయణ రావు, సమన్వయ కమిటీ ఛైర్మన్ వై. కిషోర్,టెక్నికల్ కమిటీ ఇంచార్జ్ జి. శ్రీనివాసరావు,టి. రవి తేజ,బి. శ్రీనివాసులు,వై. నాగ మల్లేశ్వరి తదితరులు హాజరయ్యారు.



. బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సౌత్ జోన్ క్రీడలకు బాలికలు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : జిల్లా స్థాయిలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో గన్నవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు మొదటి స్థానంలో నిలిచి సౌత్ జోన్ లో క్రీడా పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారు. గత రెండు రోజులుగా కేసరపల్లి వెటర్నరీ కాలేజీలో జరుగుతున్న హిల్ ఫౌండేషన్, హెచ్సిఎల్ కంపెనీ సంయుక్తంగా నిర్వహిస్తున్న క్రీడ పోటీల్లో గన్నవరం జడ్పీ బాలికలు హ్యాండ్ బాల్లో ప్రతిభ కనబరిచారు. వీరు బెంగళూరులో జరిగే సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. అలాగే ఫుట్బాల్ లో రన్నర్స్ గా గన్నవరం జడ్పీ బాలికలు నిలిచారు. షాట్ పుట్ లో సెకండ్ ప్లేస్, క్యారమ్స్ లో సెకండ్ ప్లేస్ రావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుగ్గిరాల ఝాన్సీ రాణి చెప్పారు. వీరికి శిక్షణ ఇచ్చినా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గీత అభినందించారు



కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 15 వేలమంది పైగా దర్శించుకుని అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకొనినారు. అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు మరియు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు . ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ, సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

శిఖర ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం గూడూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం (శివాలయం)లో ఆదివారం జరిగిన శిఖర ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఆయనకు దేవస్థానం అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం అనంతరం వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేసారు. అనంతరం ఎమ్మెల్యే కష్ణ ప్రసాద్ పోసిన వారి పాలెం గ్రామంలో వినాయకుని దేవస్థానంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ట ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పంచకర్ల సురేష్, మండల టిడిపి అధ్యక్షులు పోతన స్వామి, అన్నం హరి రామ కష్ణ, గోపి నాగబాబు, కాసగాని శ్రీను, ఎన్ ఏ బేగ్, పోతన రామోజీ, పాల్గున్నారు.





పంట నష్టం పరిశీలన

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో వరదల వల్ల నష్టపోయిన పంటలను ఇరిగేషన్ అధికారులతో కలిసి వరద ముప్పు ప్రాంతాలను టిడిపి జిల్లా నాయకులు పరిశీలించారు. సుమారు 1,500 ఎకరాలు నష్టపోయినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకునేలా రిటర్నింగ్ వాల్ నిర్మించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, తొండపు దశరథ జనార్ధన్, ఎంఎల్‌ఎ రాజగోపాల్ తాతయ్య, జొన్నలగడ్డ రాధాకృష్ణ, వేగినేటి గోపాలకృష్ణ, మండల అధ్యక్షులు, చింతల సీతారామయ్య, వడ్లమూడి రాంబాబు, కట్ట నరసింహారావు, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మాడుగుల సురేష్, అన్నేపాగ కిషోర్‌బాబు, రైతులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



శివాజీకి సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఇటీవల కాలంలో శివాపురం గ్రామానికి చెందిన ఏలూరి శివాజీని జిల్లా రైతు విభాగ అధ్యక్షులుగా ఎంపికైన సందర్భంగా ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆయనను నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు సన్మానించి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని, నియోజకవర్గంలో ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వ మిర్చి రైతుల్ని దారుణంగా పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని, మిర్చి రైతుల పక్షాన పోరాడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు బూడిద నర్సింహారావు, పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, జిల్లా కార్యదర్శి, సర్పంచులు, శివాపురం, అనిగండ్లపాడు గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం పట్టణానికి చెందిన వంశీ దీపక్ శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి టిడిపి అన్ని వేళల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రూ.5 వేలు మృతుని కుటుంబానికి అందజేశారు.

టెన్త్ పరీక్షలకు ఉపాధ్యాయుల కసరత్తు

ప్రజాశక్తి - గంపలగూడెం : పదో తరగతి పరీక్షల సమయం దగ్గరవుతున్న కొద్దీ విద్యార్థుల సామర్థ్యాలను పదేపదే ఉపాధ్యాయులు పరిశీలించి, కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల కార్యక్రమంలో నిత్యం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. మార్చి 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగనున్న పది పరీక్షలకు ముందు సమయాన్ని వృథా చేయకుండా ఉన్న సమయం అంతా వినియోగించి, మంచి ఫలితాలు సాధించాలని ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. వెనుకబడ్డ విద్యార్థులకు పలుమార్లు చెప్పి, చదివిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ప్రక్రియ కొనసాగుతుండగా, గురువారం గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం లెక్కల సబ్జెక్టుపై ఉపాధ్యాయులు రామకృష్ణ, మధ్యాహ్నం నుండి తెలుగు ఉపాధ్యాయులు గోదా వెంకటరామయ్య విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించారు. మొత్తం మీద మంచి ఫలితాలపై అటు విద్యార్థులు ఇటు ఉపాధ్యాయులు నిరంతర కసరత్తులో ఉన్నారు.


పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

మరమ్మతులకు నోచుకోని గరికపాడు హైవే బ్రిడ్జి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గరికపాడు వద్ద ఉన్న బ్రిడ్జి ఆగస్టు నెలలో కురిసిన వర్షాలు వరదల కారణంగా దెబ్బతిన్న విషయం తెలిసినదే. అయితే ఎన్నో నెలలుగా పనులు చేపట్టిన జనవరి నెలలో పూర్తయి ప్రారంభించుకొని వారంలోపులే బ్రిడ్జి కుంగిపోవటం మళ్లీ మరమ్మత్తులు చేపట్టడం ఇంకా పూర్తి కాకపోవడంతో ఆదివారం వైసిపి నాయకులతో కలిసి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర మధ్య ఉన్న పాలేరు బ్రిడ్జి ఆగస్టు నెలలో వచ్చిన వరదల కారణంగా బ్రిడ్జి ఒకవైపు దెబ్బతిన్నది, ఈ బ్రిడ్జి పనులు నెలలు గడుస్తున్నా కానీ నత్తనడకన పనులు పూర్తి కావట్లేదు, ప్రయాణికులు వన్ వే ద్వారా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి పనులు నాణ్యత వెంటనే పూర్తి చేయాలని లేని పక్షంలో వైసిపి ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, కన్నమల శామ్యూల్, పట్టణ యువజన ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



నిబంధనలు పాటించకుంటే జరిమానా తప్పనిసరి

ప్రజాశక్తి - నందిగామ : వాహనదారులు నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో భారీ జరిమానా చెల్లించాల్సి వస్తుందని నందిగామ పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. ఆదివారం నందిగామ మదిర రోడ్డు లో ాఆటోలకు కేసులు రాశారు. ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు హెల్మెట్ లేని కారణంగా తలకు గాయమై ప్రాణాలు పోయిన పరిస్థితి ఎన్నో చూశామన్నారు. పలుమార్లు పోలీసులు హెచ్చరికలు జారీ చేసిన కొంతమంది నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారని, ఇలా ప్రమాదాలు చోటుచేసుకుని కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. చోదకులు తస్మాత్ జాగ్రత్త. వాహనం నడిపే సమయంలో మోటారు వాహనాల చట్టాన్ని అనుసరించి కచ్చితంగా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు నిబంధనలు అతిక్రమించిన వారికి సాదాసీదాగా ఫైన్లు వేస్తూ వచ్చిన రవాణా, ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఇప్పుడు భారీ జరిమానా విధించేందుకు సిద్ధమయ్యారు.

మార్చి 1 నుండి కొత్త మోటారు వాహనాల చట్టం అమలులోకి రానున్న నేపథ్యంలో తప్పనిసరిగా చట్ట ప్రకారం ప్రతి ఒక్క వాహన దారుడు నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో భారీ జరిమానా చెల్లించాల్సి వస్తుంది.. ద్విచక్ర వాహనం నడుపుతున్న సందర్భంలో నడిపే వ్యక్తితో పాటు వెనక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి లేనిపక్షంలో రూ 2వేల వరకు జరిమానా చెల్లించాల్సి వస్తుంది. వీటితోపాటు బీమా, పొల్యూషన్, మైనర్ డ్రైవింగ్, ప్రమాదకర పార్కింగ్, రేసింగ్, నో డ్రైవింగ్ లైసెన్స్ ఇలా అన్నిటికీ భారీ జరీ మన విధించేందుకు రవాణా శాఖ సిద్ధమయింది. వాహన చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేసే అవకాశం ఈ కొత్త చట్టంలో రూపొందించారు. ఎవరు ఎప్పుడూ ఊహించని విధంగా ఈ జరిమానాలను అమలు లోనికి రానుండడంతో నిబంధనలకు అనుగుణంగా ప్రయాణాలు చేయాలని తెలిపారు. అనంతరం నందిగామ మధిర రోడ్‌లో ఆటోవాలాకు డ్రెస్ కోడ్ లేనివారికి (ఖాకీ చొక్కా) జరినామా విధించారు.



నందిగామలో ఆటోలకు కేసులు రాస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మిర్చి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరు శివాజీ, వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. చిల్లకల్లు గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు దొంగల సింహాద్రి నేతృత్వంలో ఆదివారం మిర్చి రైతుల కల్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో క్వింటాకు 10,000, 12,000 ఉంటే రూ.11,781 గిట్టుబాటు ధర రైతులకు ఎక్కడ న్యాయం జరిగినట్టు అని ప్రశ్నించారు. మిర్చి గిట్టుబాటు ధర ఏ ప్రామాణిక ఆధారంగా నిర్ణయించారో తెలియదు కానీ, రైతుకు గిట్టుబాటు ధర నిర్ణయాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. మిర్చి రైతులకు సరైన న్యాయం జరిగే వరకు వైసిపి తరఫున పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి వివిధ అనుబంధ సంఘాల నాయకులు, చిల్లకల్లు గ్రామ నాయకులు కార్యకర్తలు, రైతు సోదరులు, తదితరులు పాల్గొన్నారు.


మిర్చి పంటను పరిశీలిస్తున్న నాయకులు

8న లోక్ అదాలత్

ప్రజాశక్తి - తిరువూరు : ఈ నెల 8న తిరువూరు కోర్టులో లోక్ అదాలత్ జరుగుతుందని తిరువూరు సెక్టార్ -1 ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. తిరువూరు పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన 498ఏ, రోడ్డు ప్రమాదాలు, కొట్లాట కేసులు ఈ ఆదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచిం చారు. నూతన 85 బిఎన్ఎస్ చట్టం ప్రకా రం నమోదైన కేసుల్లో మాత్రం రాజీ కుదిరే అవకాశం లేదని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదలచినవారు ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు.



శ్రీకృష్ణ డాల్ఫిన్ దాబా, రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట క్రాస్ రోడ్డు వద్ద షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన మార్ధి వీరాకృష్ణకు చెందిన శ్రీకృష్ణ డాల్ఫిన్, డాబా రెస్టారెంట్‌ను ఆదివారం స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల టిడిపి అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, నాయకులు ఆవుల రామారావు, కళ్యాణం సూర్య ప్రకాష్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు గ్రామంలో మార్చి 1 మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి దావీదు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాల పోరాటంలో భాగంగా అమరులైన మాదిగ జాతి అమరవీరులను స్మరించుకుంటూ వారికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఆమరులైనటువంటి అమరవీరుల త్యాగ ఫలితాలను ఎప్పటికీ మర్చిపోమని అమరవీరుల త్యాగ ఫలితాలను ప్రతి ఒకరికి చేరేవరకు త్యాగ పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం.భాస్కర్‌రావు మాదిగ, పి.తిరపయ్య, పి.పేతురు, ఎం.రమేష్, కె.బెంజిమేన్, పి.కనకరావు, ఐ.బాబు, కె.యెహను, జి.జాను, కె.ఇమ్మానియేల్, జి.ముకేష్ మాదిగ, కాలనీ యూత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు
- ఎంఎల్‌సి ఎన్నికల్లో ధైర్యంగా నిలబడిన విజయలక్ష్మికి అభినందన



ప్రజాశక్తి-విజయవాడ: దళిత మహిళ, మహిళా సంఘం నేత ఈసా విజయలక్ష్మి ధైర్యంగా నిలబడి మహిళలకు ఆదర్శంగా నిలిచారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను ఎదుర్కొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి వీరోచితంగా నిలబడిన విజయలక్ష్మిని ఆదివారం సిపిఎం నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి విజయలక్ష్మి, ఇతర ప్రజా సంఘాల నేతలు నిలబడటం గర్వకారణమన్నారు. వన్‌టౌన్ ఏరియాలోని పలు పోలింగ్ బూత్‌ల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నాడు అక్రమాలు ప్రజా సంఘాలు, పిడిఎఫ్ నేతలు ఫిర్యాదులు చేసినా రాష్ట్ర ఎన్నికల కమిషన్, సంబంధిత జిల్లా అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం దారుణమన్నారు. అంతేగాక నిందితులను గుర్తించి, తగిన చర్యలు చేపట్టలేదని, కనీసం విచారణ కూడా జరపకపోవడం సోచనీయమన్నారు. ఇప్పటికయినా ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించి చాలని కోరారు. ఎన్నికలను స్వేచ్ఛగా జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకొని, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని కోరారు. కృష్ణ,గుంటూరు జిల్లల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం తెలుగుదేశం నేతలు పలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిలో భాగంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలోని ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్‌లోని 79 ఎ బూత్‌లో పోలింగ్ రోజు (గురువారం) టిడిపి నేత బుద్దా వెంకన్న, ఆపార్టీకి చెందిన పలువురు స్థానిక నేతలు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అక్రమంగా పోలింగ్ బూత్ లలో ప్రవేశించారని అన్నారు.పోలింగ్ బూత్‌కున్న తలుపులు మూసివేసి, బ్యాలెట్ పేపర్లను అధికారుల నుండి గుంజుకున్నారన్నారు. అంతేగాక వెబ్ కెమెరా కనెక్షన్లను తొలగించడానికి ప్రయత్నించారన్నారు. పిడిఎఫ్ ఏజెంటు, దళిత మహిళ, మహిళా సంఘం నేత ఈసా విజయలక్ష్మిని బయటకు వెళ్ళిపోవాలని బెదిరించారన్నారు. అంతటితో ఆగకుండా ఆమెపై దౌర్జన్యం చేసి, బయటకు గెంటి వేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. అయినా విజయలక్ష్మి మొక్కవోని ధైర్యంతో నిలిచిందన్నారు. టిడిపి నేతల దౌర్జన్యాలను ప్రశ్నించిందని, ఒక్క అంగుళం బయటికి వెళ్లకుండా, పోలీసులకు ఫిర్యాదు చేసిందని అన్నారు. ఆలస్యంగా వచ్చిన పోలీసు అధికారులు, టిడిపి నేతలను బుజ్జగించి బయటికి పంపడం అంతంత సోచనీయమం, బాధాకరమని అనాప్ర.పోలింగ్‌లో దౌర్జన్యానికి పాల్పడిన తెలుగుదేశం నేతలే ఓటర్లను అడ్డుకున్నారని పోలింగ్ అధికారులపై ఫిర్యాదు చేయటం విడ్డూరమన్నారు. ఈ ఒక్క బూత్ మాత్రమే కాదని, పలు బూత్‌లలో టిడిపి నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారని అన్నారు. అంతేగాక ప్రత్యర్థి ఏజెంట్లను బెదిరించి, ప్రలోభ పెట్టారని, అయినా పిడిఎఫ్, ప్రజాసంఘాల ఏజెంట్లు దౌర్జన్యాలను తిప్పికొట్టి ధైర్యంగా నిలబడ్డారని అన్నారు.ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ గురించి మాట్లాడిన తెలుగుదేశం నేతలు నేడు అధికారంలోకి రాగానే దౌర్జన్యాలకు పాల్పడటం, ఎన్నికలలో అక్రమాలకు పాల్పడటం గర్హనీయమన్నారు. శాసనమండలి ఎన్నికలలో తెలుగుదేశం అధిష్టానవర్గం గంట గంటకు సమీక్షిస్తూ ఓటింగ్ పెంచాలని ఆదేశాలు ఇవ్వటం, తదనుగుణంగా స్థానిక తెలుగుదేశం నేతలు అక్రమాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. దొంగ ఓట్లు వేసుకునేందుకు యత్నించారని అన్నారు.పలు చోట్ల అధికారులు ప్రేక్షక పాత్ర వహించారని, కొన్నిచోట్ల ఆలస్యంగా స్పందించారన్నారు.ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగితే గెలవలేమనే దురాలోచనతో టిడిపి కూటమి దౌర్జన్యాలకు పాల్పడటం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బోయి సత్యబాబు, ఐవి నారాయణ, ప్రజాసంఘాల నేతలు దుర్గారావు, జి వెంకటేశ్వరావు (కొండ) తదితరులు పాల్గొన్నారు.


మద్యం స్వాధీనం

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-జి.కొండూరు : విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు శీర్షికన ప్రజాశక్తిలో ఆదివారం వచ్చిన కథనానికి ఎక్సైజ్ శాఖాధికారులు స్పందించారు. మండలంలోని గంగినేని గ్రామంలో ఎక్సైజ్ శాఖాధికారులు ఆకస్మిక దాడులు చేసి గజ్జా రంగారావు వద్ద నుంచి తొమ్మిది మద్యం సీసాలు, అలా కొండలరావు నుంచి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి - నందివాడ : కృష్ణా,గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున సోమవారం మద్యం షాపులకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మండలంలోని పోలుకొండ గ్రామంలో ఓ వైన్ షాప్ నుండి కొందరు వ్యక్తులు ఇదే ఆసరాగా చేసుకుని మద్యం షాపు నుండి బెల్ట్ షాపులకు ద్విచక్ర వాహనాల పైన వినూత్న రీతిలో తిరుగుతూ మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. క్వార్టర్ బాటిల్ రేటు షాపు వద్ద రూ 200 ఉండగా బెల్ట్ షాపు వద్ద రూ.250 అమ్ముతున్నారు. షాపు వద్దకు వెళ్లలేని వారు, రాత్రుళ్ళు మద్యం అవసరమైన వారు బెల్ట్ షాపు దారుల వద్దరూ.50 అదనంగా చెల్లించి తాగుతున్నారు. మరి కొంతమంది స్కూటీ లోని సీటు కింద మద్యం బాటిళ్లను సరఫరా చేస్తూ రోడ్ల వెంబడి అమ్ముతున్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహించడం వలన మహిళలు తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలుపుతున్నారు. ఇళ్ల మధ్యలో ఉండటం బెల్ట్ షాపులు నిర్వహించడం వలన తెల్లార్లు భయభ్రాంతులతో గడపవలసి వస్తుందని మహిళలు అంటున్నారు.



కొండాలమ్మ సన్నిధి.. ప్రకృతి రమణీయతకు పెన్నిధి

- అమ్మవారి ఒడిలో సేద తీరుతున్న యాత్రికులు
- జిల్లాలో అత్యధిక ఆదాయం కలిగిన ఆలయం
- ఆది, గురువారాల్లో ఆలయానికి తాకిడి





ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి ప్రకతి రమణీయతకు పెన్నిధిగా మారింది. ఈ అందమైన ప్రకతి వాతావరణంలో భక్తులు సేద తీరుతూ...తమను తాము మరచిపోతున్నారు. అసలే వేమవరం పల్లె ప్రాంతం. ఇక పచ్చదనానికి కొదవ ఏమి ఉంటుంది. పచ్చని పొలాల మధ్య సినీ సెట్టింగులను తలపించే విధంగా కోనసీమ అందాలను గోచరించే రిసార్ట్స్‌ను ప్రైవేట్ యజమానులు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి సన్నిధిలో ఈ అందమైన రిసార్ట్స్ పక్కకు కళ్ళ తిప్పుకోని విధంగా నానాటికీ తీర్చి దిద్దుతూ అభివద్ధి చేస్తున్నారు. కృష్ణాజిల్లాలో ఏడాదికి రూ.కోటి పైబడిన అత్యధిక ఆదాయం కలిగిన శక్తి ఆలయం కొండలమ్మ ఆలయం. కొండ రాళ్లలో వెలసిన ఈ కొండలమ్మ కోరిన భక్తులకు కొంగు బంగా రంగా మారారు. వ్యాపారం, ఉద్యోగం, సంతానం, వివాహం, రాజకీయ పదవులు, పారిశ్రామికం, సినిమా అవకాశాలు ఒకటేమిటి? ఏ రంగానికి చెందిన వారైనా కొండలమ్మ అమ్మవారి వద్ద తలచుకుంటే తల వైపున ఉండి వారికి వరాల జల్లు కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలో గురు, ఆదివారాలు వారానికి దాదాపు 25వేల మంది భక్తులు మొక్కుబడుల్ని తీర్చుకుంటున్నారు. 40 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అమ్మవారి ఆలయాన్ని 20ఏళ్ల క్రితం 2005లో దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోనే గాక తెలుగు రాష్ట్రాల్లోని నలు మూలల నుంచి వచ్చే భక్తుల సందడి నానాటికీ అధికమైపోతుంది. తండోపతండాలుగా వచ్చే ఈ భక్తుల బసకు ఎన్నో పాకలు, భవనాలు వెలుస్తున్నాయి. ఎక్కడికక్కడ రిసార్ట్స్ కూడా ఏర్పడుతున్నాయి. ఈ కట్టడాలు భక్తుల్ని అమితంగా ఆకట్టుకునే విధంగా సినీ సెట్టింగులతో కోనసీమను తలపించే విధంగా తయారు చేస్తున్నారు.

అమ్మవారి సన్నిధి దినదిన ప్రవర్ధమానం... ఆకుల కొండలరావు, కొండలమ్మ ఆలయ ఈఓ

అమ్మవారి సన్నిధి దినదిన ప్రవర్ధమానమవుతుంది. అమ్మవారి వద్ద మొక్కుకున్న మొక్కుబడులతో భక్తుల కోర్కెలను కొండలమ్మ తప్పక తీరుస్తుంది. ఆ కారణంగానే భక్తులు నానాటికీ తండోపతండాలుగా వస్తున్నారు. దినితో ఆలయాభివద్ధితో పాటు అమ్మవారి సన్నిధి కూడా ఎంతో అభివద్ధి చెందుతూ ఎంతోమందికి ఉపాధిని ఇస్తోంది.





అందమైన చుట్టు గుడిసెలు

బాలభాస్కర్‌కు పిహెచ్‌డి ప్రదానం



ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసినందుకు కె. బాల భాస్కర్ కు పిహెచ్ డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఇన్ఛార్జి కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఎర్లీ డిటెక్షన్ ఆఫ్ యడ్వర్సరియల్ ఎటాక్స్ యూజింగ్ ఎంబుల్ మోడల్స్ అనే అంశంపై ఆయన పరిశోధన గ్రంథం సమర్పించారు. బాల భాస్కర్‌కు పరిశోధన పర్యవేక్షకులుగా ఆచార్య సత్యప్రసాద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ విసి ఆచార్య కే .గంగాధర రావు, డిన్ ఆర్ వి ఎస్ ఎస్ ఎన్ .రవికుమార్ తదితరులు బాలభాస్కర్‌కు అభినందనలు తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

ప్రజాశక్తి-చల్లపల్లి : దొంగ పత్రాలు సృష్టించి మంగళగిరి ప్రాంతానికి చెందిన పేద మహిళ స్థిరాస్తిని స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ చేయటంతో మహిళా రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళగిరి పోలీసులు మొవ్వకు చేరుకొని సబ్ రిజిస్ట్ పై కేసు నమోదు చేయడంతో అధికారులు ఈనెల మార్చి ఒకటో తేదీన సబ్ రిజిస్టర్ ఏ. సత్యనారాయణ ను సస్పెండ్ చేశారు.

నేటి నుండి వర్సిటీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్థిరమైన అభివృద్ధి కోసం అంశాలపై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమవుతుందని సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. సుబ్బారావు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. గంగాధరరావు , పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విశిష్ట అతిథిగా హాజరవుతారు అన్నారు. ప్రఖ్యాత సిస్టమ్స్ కెమిస్ట్రీ శాస్త్రవేత్త, టాంజానియా దేశానికి చెందిన డోడోమా విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర ఆచార్యులు ఎస్ బి నంబూరి ఈ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే అనేక నూతన ఆవిష్కరణలను ఆయన రూపొందించారు. రసాయన శాస్త్ర పరిశోధనలలో రసాయనాల వినియోగాన్ని తగ్గించి, క్వాంటం కెమిస్ట్రీ మెథడాలజీని అభివృద్ధి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన అతి తక్కువ ఖర్చుతో వినియోగించడానికి వీలుగా ఉండే ఆర్గానిక్ సోలార్ మెటీరియల్స్‌ను అభివృద్ధి చేయడానికి కషి చేస్తున్నారు. సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ సురేష్ బాబు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు చెందిన డాక్టర్ ఎస్ శంకరయ్య, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ భువనేశ్వర్ కు చెందిన డాక్టర్ డి రాంబాబు, విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి సింహాచలం, ఓఎస్డి ప్రొఫెసర్ ఆర్ వి ఎస్ ఎస్ ఎన్ రవికుమార్, విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె వీరయ్య పాల్గొంటారని చెప్పారు

89వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి : కడుపు గాలి, ఇబ్బందులు పడుతున్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులతో యాజమాన్యం, ప్రభుత్వం చెలగాటమాడుద్దని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. ఆదివారం నాటికి దీక్షలు 89వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను దుర్గారావు ప్రారంభించి మాట్లాడారు. దీక్షలో వి నవనీతం, వేముల లక్ష్మి, ఎం శారద, సామ్రాజ్యం, శారమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ, సత్య ప్రకాష్, అంకయ్య, కష్ణ, గురవయ్య, డి మాణిక్యరావు, యెహెషువ, సాంబయ్య, రమాదేవి పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న పోలీసులు

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 27న శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో జగ్గయ్యపేట చెరువు బజార్ సమీపంలో రాత్రి సమయంలో జరిగిన గొడవ నేపథ్యంలో జరిగిన హత్య కేసులో నిందితులను తమ సిబ్బందితో కలిసి జగ్గయ్యపేట పద్మావతి నగర్ చెక్‌పోస్ట్ వద్ద ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి అరెస్టు చేసినట్లు జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. మరో జువైనల్‌ను అదుపులోనికి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించడం జరుగుతుందని తెలిపారు.

నిందితుల వివరాలు : జగ్గయ్యపేట చెరువు బజార్ ప్రాంతానికి చెందిన బత్తుల కిషోర్ బాబు (25), భక్తుల వెంకట శివకుమార్ (19), బండి సాయి అంకమ్మరావు అలియాస్ సాయి(19), బండి రవికుమార్ (23), వేముల జ్వాలా నరసింహారావు (23), రూపాన వినయ్ (19) వివరాల్లోకి వెళ్తే నిందితులందరూ ఒకే పట్టణంలోని చెరువు బజార్‌కు చెందినవారు వీరందరూ మద్యం, చెడు వ్యసనాలకు బానిసలైనవారు, అదే చెరువు బజార్‌లో నివసిస్తున్న బత్తుల శ్రీను చెరువు బజార్‌లో పెద్దరికంగా వ్యవహరిస్తుండేవాడు. నిందితులకు సంబంధించిన గొడవల్లో పెద్దగా వ్యవహరించిన శ్రీనును అడ్డు తొలగించాలని చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో శివరాత్రి సందర్భంగా వారందరూ కలిసి నిర్వహించుకునే ఊరేగింపులో చంపేందుకు పథకం వేశారు. శ్రీను మేనల్లుడు ఓర్సు నాగబాబుతో ఉద్దేశ పూర్వకంగా గొడవ పెట్టుకుని, గొడవ మధ్యలో వచ్చిన శ్రీనును పథకం ప్రకారం కోడి కత్తితో పొడిచి చంపారు. కేసు విచారించిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - తిరువూరు : ఈ నెల 12న తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలంకు తిరువూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. 12న సాయంత్రం 5 గంటలకు తిరువూరు నుంచి బయలుదేరి 19న శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం రాత్రికి అరుణాచలం చేరుతుందని తెలిపారు. 14 ఉదయం తిరిగి బయల్దేరి కంచి తిరుత్తణి, శ్రీకాళహస్తి దేవాలయాల దర్శనం అనంతరం 15వ తేదీ రాత్రికి తిరువూరు చేరుతుందని తెలిపారు. తిరువూరు నుంచి రానుపోను ఒక్కొక్కరికి రూ.2800 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ రిజర్వేషన్ టికెట్లు పొందొచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 7382487969, 9885661835 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాదంతో చక్కటి పోషకాహారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రపంచ ప్రోటీన్ దినోత్సవం సందర్భంగా, ఆల్మండ్ బోర్డ్ అఫ్ కాలిఫోర్నియా సహకారంతో నిర్వహించిన కొత్త యుగోవ్ సర్వేలో బాదంతో కూడిన ఆహారం మంచి ప్రోటీన్‌గా ఉందని ప్రముఖ పోషకాహార నిపుణులు కె.ఈశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శక్తిని అందించడంలో, బలమైన రోగనిరోధక వ్యవస్థను నిర్వహించడంలో ప్రోటీన్ ముఖ్యమైన పాత్రను గుర్తించారని తేలిందన్నారు.. 17 నగరాల్లో 4,300 మంది స్పందనదారులతో నిర్వహించిన ఈ సర్వేలో, ప్రతి ముగ్గురిలోనూ ఇద్దరు బాదంపప్పులను అధిక ప్రోటీన్ కలిగిన చిరుతిండిగా గుర్తించినట్లు తేలిందన్నారు. టాప్-5 ప్రోటీన్ ఎంపికల్లో బాదం స్థానం పొందిందని సర్వే వెల్లడించిందని తెలిపారు. ప్రోటీన్ సహజ వనరుగా బాదంను గుర్తించారని తెలిపారు.. ముఖ్యంగా కాలిఫోర్నియా బాదంలో ఆరోగ్యకరమైన కొవ్వులు, డైటరీ ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం, జింక్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలుంటాయని తెలిపారు.

ఉన్నత స్థితికి కృషి, పట్టుదలే సోపానాలు

డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : వ్యక్తి ఉన్నత స్థానానికి చేరుకోవడానికి అవిరళమైన కృషి, నిరంతర శ్రమ, సాధన, శోధన, పట్టుదలలే సోపానాలని డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. ఆంధ్ర లయోలా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో వెంతురా 2క25 పేరిట సంస్కృతి క్రీడలు విద్యా నైపుణ్యాల వేడుక శనివారం సాయంత్రం దేవయ్య ఆడిటోరియంలో జరిగింది. ముఖ్యఅతిథిగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కళలు ఒత్తిడిని దూరం చేసి మానసిక వికాసాన్ని కలిగిస్తాయని వాటిలో ధ్వన్యనుకరణ కళ విశిష్టమైనదిగా చెప్పుకోవాలని ఆ కళలో దీక్షా దక్షతలతో అంకితభావంతో కృషి చేసి కీర్తి ప్రతిష్టలనార్జించిన మన ముందు మిమిక్రీ చేసిన కళారత్న సిల్వస్టర్ అని ఆ కళలో అతనొక దవ నక్షత్రమని అభివర్ణిస్తూ ప్రసంగించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయ సారథి మాట్లాడుతూ విద్యార్థులు కళలపట్ల బాల్యం నుంచే అవగాహన కలిగిఉండి, అనురక్తిని పెంచుకుని సిల్వస్టర్ వలె దేశ కీర్తిని ఇనుమడింప చేసే కళాకారులుగా ఎదగాలని కోరారు. సిల్వస్టర్ మాట్లాడుతూ తాను మిమిక్రీ ఆర్టిస్టుగా ఐదున్నర దశాబ్దాలుగా ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నానని, లయోలా కళాశాలలోనే చదివానని, దేశ విదేశాలలో ప్రసిద్ధి చెందిన ఎంతోమంది ఇదే కళాశాలలో చదివారని అన్నారు. కళలు మానసిక ఆనందం, ఉల్లాసంతో పాటు సామాజిక స్పృహ కూడా కలిగిస్తాయని, ఆ క్రమంలోనే తాను తన మిమిక్రీ ద్వారా సమాజాన్ని జాగృతి పరిచేందుకు కళను ఒక ఔషధంలా వాడుతున్నానని అంటూ దాదాపు 45 నిమిషములు మిమిక్రీ చేసి విద్యార్థులను, ఆహుతులను, వేదికపై అతిథులను నవ్వించి, ఆహ్లాదాన్ని పంచి కరతాళ ధ్వనులందుకున్నారు. వేదికపై సిల్వెస్టర్ ను ఘనంగా సత్కరించారు. రెవరెండ్ ఫాదర్ డాక్టర్ బి జోజిరెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం ఒక సాంస్కృతిక ఉత్సవం కాదని స్వీయ ఆవిష్కరణ ప్రయాణమని, ప్రతి ప్రదర్శన పోటీ, సృజనాత్మక అనుభవం, ఆత్మవిశ్వాసం, స్థితిస్థాపకత, జట్టు కృషిని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు.



సిల్వెస్టర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ డి.బాలస్వామి మాట్లాడుతూ విద్యార్థులు వృద్ధి, సృజనాత్మక వ్యక్తీకరణ కోసం అవకాశాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమం నిర్వహించడంలో విద్యార్థులు, అధ్యాపకులు కృషి వారి అంకిత భావానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఒ.మహేష్ ప్రశంసిస్తూ ప్రసంగించారు. పాటలు, నృత్యాలు, మైమ్, స్కిట్ వంటి ఇత్యాది పోటీలలో దాదాపు 500 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 130 మంది విద్యార్థులకు, అత్యుత్తమ ప్రదర్శనలకు బహుమతులు ప్రదానం చేయడంతో సభ ముగిసింది.

శ్రామిక పక్షపాతి లక్ష్మణరావు : ఓల్గా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వుప్పల లక్ష్మణరావు శ్రామికవర్గ పక్షపాతి, కమ్యూనిస్టు దృక్పథంతో రచనలు చేసినవాడు, అతని రచనల్లో సామాజిక బతుకుపోరు కనిపిస్తుందని ప్రముఖ రచయిత ఓల్గా అన్నారు. ఆదివారం శిఖర స్కూల్లో జరిగిన వుప్పల లక్ష్మణరావు రచనలు పుస్తక పరిచయ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ, ఆయన రాసిన అతడు – ఆమె నవల చదివిన తర్వాత అతడు – ఆమె – మనం అనే పేరుతో పెద్ద వ్యాసం రాసాను. శ్రీ శ్రీ ప్రింటర్స్ మొదలుపెట్టిన తర్వాత విశ్వేశ్వరరావు ప్రచురించిన మొట్టమొదటి పుస్తకం అదే అన్నారు. లక్ష్మణరావుతో తనకు ఆత్మీయమైన అనుబంధం ఉందని, ఆయన రచనలు ఆ కాలం నుంచి ఇప్పటి వర్తమానానికి అనుసంధానంగా ఉన్నాయని అన్నారు. బరంపురం వికాసం సభ్యులు కామేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్మణరావు గారికి బరంపురం తో ఉన్న అనుబంధాన్ని, వికాసంలో ఆయన పాల్గొన్న నాటి సంగతులు



మాట్లాడుతున్న రచయిత ఓల్గా

చెబుతూ, వారం వారం అనేక రచనలు చదవటం వాటిమీద చర్చలు చేసేవారని చెప్పారు. కార్యక్రమంలో దినకర్, శ్రీనివాస్, సేతుపతి ఆదినారాయణ, శ్రీ శ్రీ విశ్వేశ్వరరావు, బండ్ల మాధవరావు పాల్గొన్నారు. చినుకు రాజగోపాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



సిసి కెమెరాల వినియోగంపై సదస్సు

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గొల్లపూడి దత్త కళ్యాణ మండపంలో సిసి కెమెరాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. గొల్లపూడి దత్త కళ్యాణ మండపంలో వెస్ట్ ఎడిసిపి జి.రామకృష్ణ, వెస్ట్ ఎసిపి దుర్గారావు, భవానీపురం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో గొల్లపూడి గ్రామంలో సిసి కెమెరాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గొల్లపూడి ప్రజలు స్పందించి తమ వంతు సహకారంగా చెక్కులు అందజేశారు.

ఆదివారాలూ విద్యార్థులకు టెస్టులు

ప్రజాశక్తి - నందిగామ : ఆదివారం ప్రభుత్వం సెలవు ఇచ్చింది. విద్యార్థులకు ఆదివారం ఆట విడుపు. కానీ నందిగామ రైతుపేట నారాయణ కార్పొరేట్ పాఠశాలలో ఆదివారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, విద్యా శాఖ అధికారుల అనుమతి లేకుండా టాలెంట్ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. నందిగామ పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పుతూ, ఆకర్షణ బహుమతులు ఇచ్చి ఆకట్టుకుంటున్నారు. ఐదో తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులను లోబర్చుకుని అడ్డగోలుగా టాలెంట్ టెస్టు లు నిర్వహిస్తున్నారు. టాలెంట్ టెస్టు లు పేరుతో విద్యార్థులను మచ్చిక చేసుకుని నారాయణ కార్పోరేట్ పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులను నారాయణ కార్పోరేట్ పాఠశాల లో మూడవ అంతస్థు లో టాలెంట్ టెస్టు లు నిర్వహించటం చాలా ప్రమాదం అని తెలిసి నప్పటికీ యాజమాన్యం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కార్పోరేట్



పాఠశాల లో నిబంధన లకు విరుద్ధంగా జరిగే టాలెంట్ టెస్టులకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా వాడుకుంటున్నారని విమర్శ వ్యక్తమవుతున్నాయి. నారాయణ కార్పోరేట్ పాఠశాల వారు నందిగామ మున్సిపాలిటీకి హౌస్ టాక్స్, నీటి పన్ను కూడా చెల్లించడం లేదని అధికారులు నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నారాయణ కార్పోరేట్ పాఠశాల లో ఏలాంటి అనుమతులు లేకుండా టాలెంట్ టెస్టులు నిర్వహించటం పట్ల విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే టాలెంట్ టెస్టులు రద్దు చేయాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టాలెంట్ టెస్టులు నిర్వహించిన నందిగామ నారాయణ కార్పోరేట్ పాఠశాల యాజమాన్యం పై అధికారులు చర్యలు తీసుకోవాలని నందిగామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం పట్టపగలు తెలంగాణ రాష్ట్రం కోదాడకు చెందిన రాందేవ్ విజయ కోదాడ నుండి జగ్గయ్యపేటలోని శాంతినగర్‌లో ఉంటున్న తన మేనకోడలిని చూడటానికి పుట్టా వద్ద బస్ దిగి నడుచుకుంటూ వెళుచుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన వ్యక్తి మహిళ మెడలోని 36 గ్రాములు సుమారు రెండున్నర లక్షల విలువ గల నల్లపూసల గొలుసును తెంపుకోని వెళ్లాడు. జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్లో సదరు మహిళ ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాజు సంఘటన స్థలం వద్దకు వచ్చి పరిశీలించి మహిళ వద్ద నుండి వివరాలడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

